గోమేధికము :

భూగోళానికి అనుసంధానమై నియమిత దూరాలలో పరిభ్రమించే గ్రహగోళాలు ఏడే ఐనా వాటి మధ్యలో ఛాయాగ్రాహకులుగా ప్రశిద్ధినొందిన రాహు-కేతువులనే గ్రహాలున్నట్లు పాశ్చాత్య ఖగోళ శాస్త్రవేత్తలు నిర్ణయించారు. అట్టి ఛాయాగ్రహమైన రాహువునకు, గోమేధికమునకు చాలా దగ్గర సంభంధములున్నవి. ఒక సిద్ధాంతము ప్రకారం భూగోళము యొక్క కుడి ఎడమ భాగాలే రాహువు కేతువులని ప్రతీతి. అందువల్లనే భూమి యొక్క ఏ వైపు భాగం సూర్య చంద్రులకు అడ్డుగా వస్తుందో ఆ గ్రహ సంభంధిత గ్రహణం సంప్రాప్తిస్తున్నదని నవీన సిద్దాంతము. అట్టి గ్రహనకాలం పరమ పవిత్రమైనదిగా భారతీయుల నమ్మకం ఎప్పటికీ మార్పు లేనటువంటి భూమి యొక్క కుడి ఎడమల దూరం 180-0` డిగ్రీలైతే రాహువు కేతువు మధ్యగల దూరం కూడా 180-0′ డిగ్రీలే! భూమి యొక్క ఆగ్నేయ నైఋతీ భాగాలను కలిపే దక్షిణ దిక్కు రాహువైతే ఈశాన్య వాయువ్య భాగాలను కలిపే ఉత్తరదిక్కు కేతువనేది కొందరి సిద్ధాంతము. రాహుగ్రహాని కదిదేవత గోమాతగా వేదములందు తెలుపబడినది. అట్టిగోమాత యొక్క మూత్రము వంటి రంగు కల్గిన గోమేధికము రాహు సంభంధమనుటలో నిస్సందేహము లేదు. కావున రాహుగ్రహ ప్రీతికరమైన గోమేధికమును ధరించుట వలన జాతక గోచారములందలి రాహు దోషాలు నివారింపబడి సకల శ్రేయోభివృద్ధి జరుగ గలదు.

ఆర్ద్ర, స్వాతి, శతభిషం జన్మనక్షత్రాలవారు ఏ సమయమునందైనను గోమేధికమురత్నమును ధరించవచ్చును. మిగిలిన నక్షత్రములవారు మాత్రం తమ జన్మ సమయమునందలి గ్రహస్థితి ననుసరించిబలవంతుడైన రాహువు దుష్టస్థానములందున్న దశాంతర్దశ కాలమునందు మాత్రమే గోమేధికము ధరించుట ఉత్తమము. ఎవరికైనను వారి జన్మ జాతక ములందు రాహువు గ్రహము షడ్బలములు అషటకవర్గ బిందుబలము కలిగి జన్మలగ్నము నుండి 6-8-12 స్థానములందున్నను, ఆ అధిపతితోకూడుట చూడబడుట, తటస్థించినను, ఆ స్థానమునందు ఇతర పాపగ్రహ దృగ్యోగవేధా సంభంధము కలిగినను రాహువు బహుదోషప్రదుడుమరియు 2-5-7 స్తానములందు పాప గ్రహ సంభంధము కలిగి రాహువున్నను, గురు సంభంధమును కలిగి ధనుర్మీన రాశులయందున్నను, గురు సంభంధమును కలిగి రాహువు వున్నను, శని కుజుల సంభంధము కలిగి

జన్మలగ్న మునందున్నను, అధిక దోషప్రదుడై అపకారముల నొనర్చును, చంద్రుడు బలహీనుడై యుండగా బలవంతుడైన రాహువు నవమస్థానము నందుండిన (శుభ దృష్టి లేక )బాలారిష్టములు కలుగ చేయ గలడు.

రాహువునకు జాతకమునందలి అశుభ దశాంతర్దశలు ప్రప్తించినప్పుడు, గోచారమునందు రాహువు సంచారము దోషయుక్తమైన కాలమునందు వివిధ రూపములలో కష్టనష్టములు, ఈతి బాధలు, దారున పరిస్థితులు తటస్థించి దుఃఖప్రదముగా నుండగలదు. మరియు దుష్టగ్రహమైన రాహుగ్రహ ఫలికాలంలో కుటుంబకలహాలు, అజన విరోధములు, ఆస్తినష్టము విద్యాభంగము, వ్యాపార నష్టము, కోర్టు చిక్కులు, రోగచోరఋణబాధలు, వృత్తి ప్రతికూలత, ఆర్థిక, సామాజిక బాధలు, దెయ్యములు, ప్రయోగాదిగాగల దుష్టగ్రహ బాధలు ఆహారమునందయిష్టత ఆత్మహత్యను గూర్చి ఆలోచించుట, ఉన్మాదము, మతిభ్రమ మొదలగు మానసిక వ్యాధులే గాక కీళ్ళవాతాలు నులి పురుగులు జేరుట, కడుపులో ఏలిక పాములు విరోచనాలు (అతిసారం) లివరు, పశికర్లు, గర్భకోశంలో వాపు, కాన్సర్, కడుపునొప్పి, మలబద్ధకము మెదడుకు సంభంధించిన అనేక వ్యాధులు రహస్యముగా ఆచరించే చెడుపనులు, దుష్టుల స్నేహం వలన ఆపదవలు మొదలగు అనేక కష్ట నష్టములు దుఃఖబాధలు సంభవింపగలవు.

గోమేధికము వలన కలిగే శుభయోగాలు :

ఇది రాహుగ్రహానికి సంభంధించిన రత్నమగుట వలన రాహుగ్రహ దోషములన్నింటినీ పరిహరింప జేయుటమే గాక కుటుంబసౌఖ్యము జనానుకూలత, విధ్యాభివృద్ధి, కృషిలో విజయము , ఆర్థికపుష్టి, వృత్తిలాభము, సమాజంలో గౌరవము, ఆరోగ్యము, స్త్రీమూలక ధనప్రాప్తి, ఆకస్మిక ద్రవ్య లాభము, వారసత్వపు ఆస్తిసంక్రమించుట, ఋణబాధలు తీరిపోవుట, సన్మిత్రలాభము, బంధువుల ఆదరణ కల్గుట, మాతామహ వర్గీయుల ద్వారా ఉపకారము, రాజకీయ, కోర్టు వ్యవహారములందు పరిష్కారము, గంగా స్నానఫలము, దైవభక్తి స్థిరబుద్ధి, సన్మానమార్గము ధనాభివృద్ధి, ఆకస్మిక ప్రమాదములనుంచి, దుష్టగ్రహ పీడల నుంచి రక్షణ, శతృనాశనము, మిత్రవర్గముల వారి సహాయ సంపత్తి లభించుట, గండములు తొలగిపోవుట, దీర్ఘవ్యాధుల

నుండి విముక్తి, సంపూర్ణారోగ్యము, భూగృహక్షేత్ర సంపద కలుగుట, అఖండకీర్తి, జయము క్షేమము, ఉల్లాసము కలుగగలవు.

గోమేధికము ధరించే పద్ధతి : దోషములు లేని ఉత్తమ లక్షణములు గల గోమేధికము బంగారం లేక పంచలోహముల ఉంగరమునందు బిగించిధరించిన యెడల అభీష్టము చేకూరగలదు. వెండి గోమేధికమును బిగించుటకు పనికిరాదు. ఈ రత్నమును బిగించు ఉంగరముపైభాగముపై చేట ఆకారముగా పీఠము నేర్పటుగావించి అడుగుభాగం మ్మాత్రం రంధ్రమునుంచి గోమేధికమును పీఠము మధ్యభాగములో బిగించి శుద్ధి గావించి ధరించవలెను. రాహుగ్రహస్తమైన సూర్య లేక చంద్ర గ్రహణములు సంభవించిన కాలమునందుగానీ, ఆదివారము పుష్యమీహస్తా నక్షత్ర యుక్తమైనపుడు కానీ, సప్తమీ ఆదివారము వచ్చినప్పుడుగానీ అదే విధంగా అమావాస్య ఆదివారమ్నాడుగానీ మకర సంక్రాంతి పుణ్యకలమునందుగానీ సూర్యుని హోరా జరిగే సమయమునందుగానీ శాస్త్రీయంగా తయారు చేయబడిన ఉంగరము నందు గోమేధికమును బిగించాలి. ఆ తదుపరి ఉంగరమును ఒక దినము కాకరాకు పసరయందు మరుసటిరోజు గోమూత్రము నందు మూడవదినము ఆవుపాల యందు నిద్ర గావింపజేసిన పరిశుద్ధము కాగలదు. అటుపిమ్మట పంచామృత స్నానముగావింపజేసి శాస్త్రోక్తకముగా షోడశోపచార పూజలు గావింపజేసి శుభముహూర్తమునందు వ్రేలికి ధరించుట శాస్త్రీయ సమ్మతము ధరించెడి వారికి తారాబలం చంద్రబలములు కలిగియున్న శుభతిధులు కలిగియున్నప్పుడు వర్జ్య దుర్ముహుర్తాలు లేని కాలంలో మృగశిర, ఉత్తర, చిత్త, శతభిషం, ఉత్తరాభాద్ర నక్షత్రములయందు వృషభ, మిధున, సింహం కుంభలగ్నములు జరుగు సమయములందు పూజించిన ఉంగరమును ధరించవలెను ధరింపబోవు సమయమునకు ముందు ఉంగరమును కుడిహస్తము నందుంచుకొని దక్షిణ ముఖముగా తిరిగి నిలబడి గురువుని, గణపతిని ధ్యానించి "ఓం భ్రీం ఐం హ్రీం శ్రీం తమోగ్రహాయ స్వాహ" అను మంత్రమును 108 పర్యాయాలు జపించి ఉంగరమును ముమ్మరు కనుల కద్దుకొని కుడిచేతి ఉంగరపు(అనామిక) వ్రేలికి ధరించాలి. స్త్రీలు ఎడమ వ్రేలికి ధరించుట ఆచారము గలదు. నవరత్నములను గాక ఇతర రత్నములు చేయించుఉంగరములో గోమేధికముతో బాటుగా ముత్యాలను, వైడూర్యములు జేర్చి ఉంగరమును ధరించకూడదు.